**Telugu**

# The Spoken Word

by

WILLIAM MARRION BRANHAM

# దేవత్వమును గ్రహించుట

## (UNDERSTANDING THE GOD HEAD)

పలుకబడిన మాటయే మూలవిత్తనం

# దేవత్వమును గ్రహించుట
## (UNDERSTANDING THE GOD HEAD)

**ప్రకటన 1:4–6.** "యోహాను ఆసియాలో ఉన్న ఏడు సంఘములకు శుభమని చెప్పి వ్రాయునది. వర్తమాన భూత భవిష్యత్కాలములలో ఉన్నవాని నుండియు ఆయన సింహాసనము ఎదుట నున్న యేడు ఆత్మల నుండియు, నమ్మకమైన సాక్షియు మృతులలో నుండి ఆది సంభూతుడుగా లేచిన వాడును, భూపతులకు అధిపతియునైన యేసు క్రీస్తు నుండియు కృపా సమాధానములు మీకు కలుగును గాక. మనలను ప్రేమించుచు తన రక్తము వలన మన పాపముల నుండి మనలను విడిపించిన వానికి మహిమయు, ప్రభావమును యుగ యుగములు కలుగును గాక! ఆమేన్. ఆయన మనలను మన తండ్రియగు దేవునికి ఒక రాజ్యముగాను, యాజకులను గాను జేసెను."

"ఆసియా" అను మాటకు ఆసియా మైనరు అని అర్థము. అది ఒక చిన్న భూభాగము. ఇండియానా రాష్ట్రమంత పరిమాణములో యుండును. అక్కడ ఈ ఏడు సంఘములున్నవి. అక్కడుండిన ఇతర సంఘములన్నింటిలో నుండి వీటిని ఎన్నుకొనుట జరిగినది. ఎందుకనగా వాటికి ప్రత్యేక గుణ లక్షణములున్నవి. శతాబ్దముల తరువాత ఆ యా కాలములలో వచ్చు సంఘములకు అదే గుణ లక్షణములుండును.

సింహాసనము ఎదుట ఏడు ఆత్మలున్నవి. ఏడుగురు వర్తమానికులలో ప్రతి వారిలోను ఆ ఆత్మ యుండెను. ప్రతి వారికిని వారు జీవించిన కాలమునకు చెందిన పరిచర్య ఆత్మ ద్వారా ఇవ్వబడెను.

ఈ పలుకబడిన పదములను చూడండి. ''ఇపుడున్న వాడు'', ''ముందున్న వాడు'', ''రాబోవు వాడు'', ''నమ్మకమైన సాక్షియు'', ''మృతులలో నుండి ఆది సంభూతుడుగా లేచిన వాడును'', ''భూపతులకు అధిపతియు'', ''అల్ఫాయు, ఓమెగయు'', ''సర్వాధికారియు'', అను ఈ మాటలన్నియు ఒకే వ్యక్తికి సంబంధించిన బిరుదులు మరియు వర్ణనలు. ఆయనే ప్రభువైన యేసు క్రీస్తు. మన పాపములను ఆయన తన స్వరక్తమందు కడిగెను.

యోహానులో నున్న దేవుని ఆత్మ యేసు క్రీస్తు యొక్క ఎనలేని దేవత్వమును ఆ విధముగా క్రమ పద్ధతిలో వ్యక్తపరచెను. దైవత్వమును ఒకే దేవునిగా బయలు పరిచెను. ఈనాడు పెద్ద తప్పు జరుగుచున్నది. ఒక్క దేవునికి బదులుగా ముగ్గురు దేవుళ్ళను వారు చూపించు చున్నారు. ఈ ప్రత్యక్షత యేసు క్రీస్తు ద్వారా యోహానుకు ఇవ్వబడినది. ఆ తప్పును ఆయనే సరిదిద్దెను. అక్కడ ముగ్గురు దేవుళ్ళు కారు గాని ఒకే దేవుడు మూడు కార్యాలయములలో యున్నాడు. ఒకే దేవునికి తండ్రి, కుమారుడు, పరిశుద్ధాత్మ అను మూడు బిరుదులున్నవి. ఈ గొప్ప ప్రత్యక్షతను ఆది సంఘము కలిగి యుండినది. ఈ చివరి దినమున అది తప్పక పునరుద్ధరింప బడును. నీటి బాప్తిస్మము యొక్క సరయిన విధానముతో పాటుగా ఇది కూడా చక్కదిద్దబడును.

ఇపుడు ఆధునిక వేదాంత పండితులు నాతో సమ్మతించరు. ఒక గొప్ప క్రైస్తవ పత్రికలో ఈ విధముగా వ్రాసిరి. ''ఆ బోధ (త్రిత్వము) పాత నిబంధనకు గుండె వంటిది మరియు ఆయువు పట్టుగా నున్నది. అది అన్ని విధములగాను క్రొత్త నిబంధనకు హృదయము వంటిది మరియు కేంద్రము వంటిది. ఒక్కరి కంటె ఎక్కువ దేవుళ్ళున్నారను తలంపునకు పాత నిబంధన ఎంత వ్యతిరేకముగా యున్నదో క్రొత్త నిబంధనయు అంతే వ్యతిరేకతకు చూపును. అయినప్పటికిని క్రొత్త నిబంధన. తండ్రి దేవుడనియు, కుమారుడు దేవుడనియు, పరిశుద్ధాత్మ దేవుడనియు సమానమగు వివరణతో బోధించు చున్నది. ఈ మూడును ఒకే వ్యక్తి యొక్క మూడు రూపములు కావు గాని ముగ్గురు వ్యక్తులు ఒకరికొకరు సంబంధము కలిగి నిజ స్థితిలో

నిలువబడి యున్నారు. ముగ్గురు వ్యక్తులు గాని ఒకే దేవుడు అను గొప్ప సిద్ధాంతము ఇక్కడ మనకున్నది.''

వారింకా ఇట్లు చెప్పుచున్నారు ''బైబిలు ప్రకారము దేవుడు ఒకే వ్యక్తి కాదు గాని ముగ్గురు వ్యక్తులుగా యున్న ఏక దేవుడై యున్నాడు. అది త్రిత్వము యొక్క గొప్ప మర్మము.''

అది నిజమైతే ఒకే దేవునిలో ముగ్గురు వ్యక్తులు ఎట్లుండ గలరు? అందుకు సంబంధించిన బైబిలు లేదు సరి గదా, జ్ఞానయుక్తమైన యోచన కూడా వారికి లేదని తెలియుచున్నది. ముగ్గురు ప్రత్యేక వ్యక్తులు. గుర్తింపబడు స్వరూపములను కలిగి యుండిరట. వారి మాటలకు అసలు అర్థమే లేదు. వారి భాషకు భావము లేదు.

ఈ మాటలు మరల వినండి. ''అల్ఫాయు, ఓమెగయు, ఆదియును, అంతమును, ఉన్నవాడును, ఉండిన వాడును, రానై యున్నవాడును సర్వాధికారియు నని దేవుడునగు ప్రభువు సెలవిచ్చుచున్నాడు.'' అది దైవత్వము. ఇతడు ఒక సామాన్య ప్రవక్త కాదు. లేదా మనిషి కాడు. ఈయన దేవుడు. ఇది ముగ్గురు దేవుళ్ళ ప్రత్యక్షత కాదు గాని సర్వశక్తుడగు ఒకే దేవుని ప్రత్యక్షత.

సంఘము యొక్క ప్రారంభములో వారు ముగ్గురు దేవుళ్ళ యందు విశ్వాస ముంచలేదు. అపోస్తలుల మధ్య అటువంటి విశ్వాసమున్నట్లు మీరు కనుగొనలేరు. అపోస్తలుల కాలము తరువాత ఈ సిద్ధాంతము ప్రవేశించి చర్చనీయాంశ మయ్యెను. నైసీన్ ఆలోచన సభలో ఒక ప్రధాన బోధగా మారినది. దైవత్వము యొక్క బోధ మూలముగా నైసీయా వద్ద రెండు విధముల చీలికలు వచ్చెను. ఆ చీలికలో నుండి రెండు విపరీతములు వెలుపలకు వచ్చెను. ఒకటి ఏమనగా బహు దేవత్వము. అనగా ముగ్గురు దేవుళ్ళను నమ్ముట. మరొకటి ఏక దేవత్వము. అయితే అది వచ్చుటకు కొద్ది సమయము పట్టెను గాని వచ్చినది. నేడు దానిని కలిగి యున్నాము. ఆత్మ వలన సంఘములకు యోహాను ద్వారా కలిగిన పత్యక్షతలో:

"నేను ప్రభువైన యేసు క్రీస్తును. నేను సర్వస్వమై యున్నాను. మరొక దేవుడు లేడు." ఈ ప్రత్యక్షతపై ఆయన తన ముద్ర వేసెను.

దీనిని ఆలోచించండి. యేసుకు తండ్రి ఎవరు? మత్తయి 1:18 చెప్పు చున్నది. "ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా నుండెను." దేవుడే తన తండ్రియని యేసు స్వయంగా చెప్పుకొనెను. తండ్రియగు దేవుడు, పరిశుద్ధాత్మయగు దేవుడు అను మాటలను మనము తరచుగా వాడుచుందుము. తండ్రిని మరియు ఆత్మను ఒక్కటిగా చేయుచున్నాము. నిశ్చయంగా వారు ఆ విధముగానే యున్నారు. లేని యెడల యేసుకు ఇద్దరు తండ్రులుందురు. కాని తానును తన తండ్రియు ఏకమై యున్నామని యేసు చెప్పినది గమనించండి – ఇద్దరు కారు. అందువలన దేవుడు ఒక్కడే అగు చున్నాడు.

చరిత్ర ప్రకారము గాను మరియు లేఖన పూర్వకముగాను ఇది నిజమయి నందున ఆ ముగ్గురు ఎక్కడ నుండి వచ్చిరా అని జనులు ఆశ్చర్యపడు చుందురు. క్రీ. శ. 325 లో నైసీన్ ఆలోచన సభ యొద్ద అది ఒక సంస్థాపక మూల సిద్ధాంతమయినది. ఈ త్రిత్వము (పూర్తిగా ఇది లేఖనానుసారము కాని మాట) రోమ్ యొక్క అనేక సిద్ధాంతము మీద ఆధారపడినది. రోమనులకు అనేక దేవుళ్ళున్నారు. వారు వారికి ప్రార్థించు చుండిరి. పితరులను మధ్యవర్తులుగా ప్రార్థించు చుండిరి. పాత దేవుళ్ళకు క్రొత్త పేర్లు పెట్టుటకు కేవలము ఇది ఒక ముందడుగుగా యున్నది. బైబిలును అధికము చేయుటకు పరిశుద్ధులుండిరి. ఆ విధముగా జుపిటర్, వెనిస్, మార్సు మొదలగు వారికి బదులుగా పాల్, పీటర్, ఫాతిమా, క్రిస్టోఫర్ మొదలగు వారు వచ్చిరి. ఒకే దేవునితో వారు తమ అన్య దేవతారాధన అను మతమును చేసికోలేకపోయిరి. కాబట్టి వారాయనను మూడుగా చీల్చిరి. పరిశుద్ధులను వారు మధ్యవర్తులనుగా మార్చిరి. తమ పితరులను మధ్య వర్తులుగా వారు మార్చిరి.

అప్పటి నుండియు జనులు మూడు కార్యాలయములు లేదా ప్రత్యక్షతలు గల ఒకే దేవునిని గ్రహించుటలో విఫలమయిపోయిరి. లేఖనము ప్రకారము ఒకే

దేవుడున్నాడని వారికి తెలియును. కాని వారు, దేవుడు ద్రాక్షా గెల వలె యున్నాడని అద్భుతమగు సిద్ధాంతమును రూపొందించు చున్నారు. అదే దైవత్వముతో ముగ్గురు వ్యక్తులు సమానముగా యున్నారని చెప్పెదరు. కాని ఈ ప్రకటన గ్రంథములో, యేసు ''ఉన్నవాడు'', ''ఉండిన వాడు'', ''రానున్న వాడు'', అని తేటగా చెప్పబడెను. ఆయనే అల్ఫాయు మరియు ఓమెగయు అయి యున్నాడు. దానికి అర్థము "A నుండి Z" వరకు అంతయూ అని అర్థము. ఆయనే సర్వస్వమును – సర్వ శక్తుడును షారోను పుష్పము లోయలోని పద్మము. ప్రకాశమును మరియు నక్షత్రము, నీతిమంతుడగు కొమ్మ, తండ్రి, కుమారుడు, మరియు పరిశుద్ధాత్మ. ఆ దేవుడే. సర్వశక్తుడగు దేవుడు ఒకే దేవుడై యున్నాడు.

I తిమోతీ 3:16 లో ఇట్లున్నది. ''నిరాక్షేపముగా దైవ భక్తిని గూర్చిన మర్మము గొప్పదై యున్నది. ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యేను. ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పునొందెను. దేవదూతలకు కనబడెను. రక్షకుడని జనములలో ప్రకటింపబడెను. లోకమందు నమ్మబడెను. ఆరోహణుడై తేజోమయు డయ్యేను. ఈ విధముగా బైబిలు చెప్పుచున్నది. ఇక్కడ మొదటి వ్యక్తి గూర్చి గాని, లేదా రెండవ వ్యక్తి గూర్చి గాని, మూడవ వ్యక్తి గూర్చి గాని చెప్పలేదు. దేవుడు శరీరమందు ప్రత్యక్షమాయెనని చెప్పెను. ఒకే దేవుడు. ఆ ఒక్క దేవుడు శరీరమందు ప్రత్యక్షమాయె ననుటకు ఇది చాలును. దేవుడు ఒక మానవ రూపములో వచ్చెను. అందువలన ఆయన మరొక దేవుడు కాడు గాని ఆయన దేవుడు. అది ఆనాటి ప్రత్యక్షతగా ఉండినది. ఇపుడును అదియే ప్రత్యక్షత. ఒకే దేవుడు.

మనము తిరిగి బైబిలు యొద్దకు వెళ్ళుదము. ఆయన స్వయంగా ఇచ్చుకొనిన ప్రత్యక్షత ప్రకారముగా ఆదియందు ఆయన ఏమై యున్నాడో చూచెదము. ఆ గొప్ప యెహెూవా అగ్ని స్తంభములో ఇశ్రాయేలునకు ప్రత్యక్షమాయెను. నిబంధనకు దూతగా ఆయన ఆ అగ్ని స్తంభములో జీవించెను. అను దినము ఇశ్రాయేలీయులను నడిపించెను. ఆలయము యొద్ద ఆయన తన రాకను గూర్చి ఒక గొప్ప మేఘము ద్వారా ప్రకటించెను. ఆ తరువాత ఒక దినమున ఆయన కన్యకకు జన్మించెను. ఆయన తన కొరకు సిద్ధపరచబడిన శరీరమును పొందెను.

ఇశ్రాయేలు యొక్క గుడారములకు పైన నివాసము చేసిన దేవుడు ఇపుడు తానే ఒక శరీరపు గుడారమును ధరించుకొని మనుష్యుల మధ్య మనిషిగా నివాసము చేసెను. కాని ఆయన ఆ దేవుడే అయి వున్నాడు.

క్రీస్తులో దేవుడున్నాడని బైబిలు బోధించు చున్నది. శరీరము యేసు. దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణతయు ఆయనలో నివాసము చేసెను. శరీరరీత్యా ఆయనలో యుండెను. అంతకంటె తేటగా నున్నది మరియొకటి ఏదియూ లేదు. మర్మమే, కాని ఇది వాస్తవ సత్యము – అంతకంటె విశేషముగా మరేమియూ చెప్పలేము. అప్పుడాయన ముగ్గురు వ్యక్తులుగా లేడు. ఇప్పుడును ఆయన ముగ్గురు వ్యక్తులుగా యుండడు. ఒకే దేవుడు. ఈ దేవుడే శరీరమును ధరించుకొనెను.

"నేను దేవుని యొద్ద నుండి వచ్చి యున్నాను. (తిరిగి) దేవుని యొద్దకు ఎక్కిపోవు చున్నాను" అని యేసు చెప్పెను. యోహాను 16:27–28. ఖచ్చితంగా అదే జరిగిన ఆయన తన యొక్క మరణము, సమాధి, పునరుద్ధానముల మూలముగా భూమి మీద నుండి అదృశ్యుడాయెను. ఆరోహణము తరువాత దమస్కునకు పోవు మార్గములో పౌలు ఆయనను కలిసికొనెను. ఆయన పౌలుతో ఇట్లు మాట్లాడెను. "సౌలా, సౌలా, నీవు నన్నెందుకు హింసించు చున్నావు?" అందుకు పౌలు "ప్రభువా, నీవెవడవని" అని అడుగగా, "నేను యేసును" అని ఆయన చెప్పెను. ఆయన అగ్ని స్తంభముగా యుండి, గ్రుడ్డితనము కలుగజేసిన వెలుగుగా వున్నాడు. ఆయన ఖచ్చితముగా చెప్పినట్లే ఆయన యథాస్థానమునకు తిరిగి వెళ్లెను. శరీరము అను గుడారమును ధరించక ముందు ఆయన ఏ రూపములో యుండెనో ఆ రూపమునకు తిరిగి వెళ్ళెను. అది యోహాను చూచినట్లే ఖచ్చితముగా ఉండెను. యోహాను 1:18: "ఎవడును ఎప్పుడైనను దేవుని చూడలేదు. తండ్రి రొమ్మున నున్న అద్వితీయ కుమారుడే ఆయనను బయలుపరిచెను." యేసు ఎక్కడ ఉన్నాడని యోహాను చెప్పుచున్నాడో, గమనించండి! ఆయన తండ్రి యొక్క రొమ్మున ఉన్నాడు.

లూకా 2:11 చెప్పుచున్నది. "దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టి యున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు." ఆయన క్రీస్తుగా జన్మించెను. ఎనిమిది దినముల తరువాత ఆయన సున్నతి చేయబడినప్పుడు దేవదూత చెప్పిన ప్రకారము ఆయనకు యేసు అను పేరు పెట్టబడెను. దేవదూత ఆ పేరును బయలుపరచెను. నేను బ్రాన్‌హామ్‌గా జన్మించితిని. తరువాత నాకు విలియం అను పేరు పెట్టిరి. ఆయనే క్రీస్తు. అయినను మనుష్యుల మధ్యలో ఆయనను గుర్తించుటకు ఒక నామమివ్వబడెను. మనుష్యులందరికిని కనబడు బాహ్య గుడారము యేసు అని పిలువ బడెను. ఆయన మహిమకు ప్రభువు. సర్వశక్తుడగు వాడు శరీరమందు ప్రత్యక్షమాయెను. ఆయనే తండ్రియగు, కుమారుడగు, పరిశుద్ధాత్ముడగు దేవుడు. సర్వస్వము ఆయనే.

తండ్రి, కుమారుడు మరియు పరిశుద్ధాత్మ అనునవి కేవలము బిరుదులు. అవి పేర్లు కావు. ఆ కారణము చేతనే మనము ప్రభువైన యేసు క్రీస్తు నామములో బాప్తిస్మము ఇచ్చుచున్నాము. ఎందుకనగా అది ఆయన నామమయి యున్నది గాని బిరుదు కాదు. ఆ బిరుదుల యొక్క నామమది. మీకు క్రొత్తగా శిశువు జన్మించి నపుడు ఆ శిశువుకు పేరు పెట్టుదురు. కుమారుడు అనునది బిరుదు. ఆ కుమారునికి నీవు జాన్ హెన్రీ బ్రవున్ అని పేరు పెట్టెదవు. నీవు కేవలము యేసు నామములో బాప్తిస్మమియ్యరాదు ప్రపంచములో వేలాదిమంది యేసు లున్నారు. మన రక్షకుడగు యేసుకు ముందును వారున్నారు. కాని క్రీస్తుగా జన్మించిన వాడు ఒక్కడే యున్నాడు. ఆయన "ప్రభువైన యేసు క్రీస్తు."

దేవుని యొక్క నిత్య కుమారుడు యేసు అని జనులు చెప్పుకొను చుందురు. అది ఒక వ్యతిరేకముగా లేదా? కుమారుడు నిత్యమైన వానిగా ఉండుట గూర్చి ఎవరు విన్నారు? కుమారులకు ప్రారంభమున్నది కాని నిత్యమను దానికి ప్రారంభము లేదు. ఆయన నిత్యుడగు దేవుడు. (యెహోవా) శరీరమందు ప్రత్యక్షమాయెను.

యోహాను సువార్తలో ఇట్లు చెప్పబడెను. "ఆది యందు వాక్యముండెను. వాక్యము దేవుని యొద్ద ఉండెను. వాక్యము దేవుడై యుండెను. ఆ వాక్యమే

శరీరధారియై మన మధ్య నివసించెను.'' తండ్రి యొక్క నిత్యమగు వాక్కునకు ఆయనే నిజమగు నమ్మకమైన సాక్షి. ఆయన ఒక ప్రవక్త. తండ్రి తనను ఏమి చెప్పుమని ఆజ్ఞాపించునో దానినే చెప్పును. ''నా తండ్రి నా యందున్నాడు'' అని ఆయన చెప్పెను. ఆలయముగా 'నున్న యేసు అదే చెప్పెను. ''నా తండ్రి నాలో యున్నాడు.''

దేవునికి చాలా బిరుదులున్నవి : ''మన నీతి.'' ''మన సమాధానము.'' ''నిత్యమూ ఉండువాడు.'' ''తండ్రి'' ''కుమారుడు'' ''పరిశుద్ధాత్మ.'' కాని ఆయనకు ఒక మానవ పేరున్నది. ఆ పేరు యేసు.

గందరగోళము చెందవద్దు. ఎందుకనగా ఆయనకు మూడు కార్యాలయము లున్నవి. ఆయనకు మూడు విధముల ప్రత్యక్షత యున్నది. భూమి మీద ఆయన ప్రవక్తగా ఉండెను. పరలోకమందు ఆయన యాజకునిగా యున్నాడు. రాజులకు రాజుగా ఆయన ఈ భూమి మీదికి మరల రాబోవు చున్నాడు. ఆయన ఉండిన వాడు – అనగా యేసు. ప్రవక్త. ఆయన ఉన్నవాడు – అనగా ప్రధాన యాజకునిగా యుండి మధ్యవర్తిత్వము చేయుచున్నాడు. ఆయన మన రోగములను, బలహీనత లను భరించ గలవాడు. ఆయన రాబోవు చున్నవాడు – అనగా రానై యున్న రాజు. భూమి మీద ఆయన వాక్యముగా యుండెను. అనగా ప్రవక్త. ఆయనను గూర్చి మోషే ''మీ ప్రభువగు దేవుడు నా వంటి యొక ప్రవక్తను మీలో పుట్టించును. ఆ ప్రవక్త యొక్క మాట వినని వారు జనుల మధ్య నుండకుండా కొట్టి వేయ బడుదురు.'' అని చెప్పెను.

యేసును గూర్చిన ఈ వాస్తవములను గమనించండి. భూమి మీద ఆయన ప్రవక్తగాను, గొర్రెపిల్లగాను, కుమారునిగాను యుండెను. ఇందువలన ఆయన ముగ్గురుగా లేడు. ఇవి ఆయన యొక్క ప్రత్యక్షతలు లేదా యేసు అను ఒకే వ్యక్తి యొక్క మూడు కార్యాలయములు.

దైవత్వములో ఒక వ్యక్తి కన్న ఎక్కువ మంది వ్యక్తులున్నారని ఈ త్రిత్వ వాదులు ఎత్తి చూపు ఒక వాక్య భాగమున్నది. దానిని వారు తరచుగా చూపించు

చుందురు. అది ప్రకటన 5:6–8. "మరియు సింహాసనమునకును ఆ నాలుగు జీవులకును పెద్దలకును మధ్యను వధింపబడినట్లుండిన గొఱ్ఱెపిల్ల నిలిచి యుండుట చూచితిని. ఆ గొఱ్ఱెపిల్లకు ఏడు కొమ్ములును, ఏడు కన్నులు ఉండెను. ఆ కన్నులు భూమి యందంతటికి పంపబడిన దేవుని ఏడు ఆత్మలు. ఆయన వచ్చి సింహాసనము నందు ఆసీనుడై యుండు వాని కుడి చేతిలో నుండి ఆ గ్రంథమును తీసికొనెను. ఆయన దానిని తీసికొనినప్పుడు ఆ నాలుగు జీవులును, వీణెలును, ధూప ద్రవ్యములతో నిండిన సువర్ణ పాత్రలును పట్టుకొనియున్న ఆ ఇరువది నలుగురి పెద్దలును ఆ గొఱ్ఱెపిల్ల యెదుట సాగిలపడిరి. ఈ పాత్రలు పరిశుద్ధుల ప్రార్థనలు." నిశ్చయముగా ఈ వచనములను ఒక్కొక్క దానిగా చూచిన యెడల వారి వాదమును నిజమని రుజువు చేయును. నేను చెప్పినది మీరు గమనించండి. ఒంటరిగా ఈ వచనములను చూచినచో అలాగు అర్థము వచ్చును. ప్రకటన 4:2–3 మరియు 9:11 వచనములను చదవండి. "వెంటనే నేను ఆత్మ వశుడనైతిని. అదిగో పరలోక మందు ఒక సింహాసనము వేయబడి యుండెను. సింహాసనము నందు ఒకడు ఆసీనుడై యుండెను. ఆసీనుడైన వాడు దృష్టికి సూర్యకాంత పద్మ రాగములను పోలిన వాడు. మరకతము వలె ప్రకాశించు ఇంధ్ర ధనుస్సు సింహాసనమును ఆవరించి యుండెను. ఆ సింహాసనము నందు ఆసీనుడై యుండి యుగ యుగములు జీవించుచున్న వానికి మహిమయు, ఘనతయు కృతజ్ఞతా స్తుతులును కలుగును గాకని" ఆ జీవులు కీర్తించు చుండగా, ఆ ఇరువది నలుగురు పెద్దలు సింహాసనము నందు ఆసీనుడై యుండు వాని యెదట సాగిలపడి, యుగ యుగములు జీవించు చున్న వానికి నమస్కారము చేయుచూ – ప్రభువా, మా దేవా, నీవు సమస్తమును సృష్టించితివి. నీ చిత్తమును బట్టి అవి యుండెను. దానిని బట్టియే సృష్టింపబడెను. గనుక నీవే మహిమ ఘనత ప్రభావములు పొంద నర్హుడవని చెప్పుచు తమ కిరీటములను ఆ సింహాసనము ఎదుట వేసిరి." రెండవ వచనములో జాగ్రత్తగా గమనించిన యెడల "ఒకటి" (రెండు కాదు లేక మూడు కాదు. ఒక్కటి) ఒకడు సింహాసనము మీాద కూర్చొని యుండెను. మూడవ వచనములో ఇట్లున్నది. "ఆసీనుడైన వాడు" (వారు కాదు) అతడు

సూర్యకాంత పద్మరాగములను పోలిన వాడు. తొమ్మిదవ వచనములో "ఆయనకు" జీవులు ఘనతను కీర్తించుచున్నట్లుగా చూడగలము. (వారుకి, కాదు) పెద్దలు "ఆయన" ఎదుట సాగిలపడునట్లుగా పదవ వచనములో యున్నది. (వారు కారు) ప్రభువా, నీవే అర్హుడవని వారు కేకలు వేసినట్లుగా పదకొండవ వచనములో యున్నది. (ప్రభువులు కారు) ఈ సింహాసనము మీద యున్నవాడే "సృష్టి కర్త" యని పదకొండవ వచనములో చెప్పబడినది. ఆయనే యేసు. (యోహాను 1:13) ఆయనే పాత నిబంధన యొక్క యెహోవా, దేవుని ఆత్మయై యున్నాడు. (ఆది కాండము 1:1)

కాని అక్కడే మనము ఆగిపోరాదు. ఇపుడు ప్రకటన 3:21 చదవండి. "నేను జయించి నా తండ్రితో కూడా ఆయన సింహాసనము నందు కూర్చుండియున్న ప్రకారము జయించు వానిని నాతో కూడా నా సింహాసనము నందు కూర్చుండ నిచ్చెదను." హెబ్రీ 12:2 కూడా చదవండి. "విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించువాడునైన యేసు వైపు చూచుచు మన యెదుట ఉంచబడిన పందెములో ఓపికతో పరుగెత్తుదము. ఆయన మన యెదుట ఉంచబడిన ఆనందము కొరకై అవమానమును నిర్లక్ష్యపెట్టి సిలువను సహించి దేవుని సింహాసనము యొక్క కుడి పార్శ్వమున ఆసీనుడై యున్నాడు." గమనించండి. ప్రకటన గ్రంధమును వ్రాసిన యేసే తండ్రితో ఇక్కడ కూర్చొని యున్నాడు. ఆయన దేవుని యొక్క కుడి పార్శ్వమున కూర్చొని యున్నాడని పౌలులో యున్న ఆత్మ చెప్పు చున్నది. (ఆ ఆత్మ క్రీస్తు యొక్క ఆత్మ. ఏలయనగా వాక్యము ఆ ప్రవచనాత్మ ద్వారానే వచ్చును) కాని యోహాను సింహాసనము మీద "ఒక్కనినే" చూచెను. ప్రకటన 5:6–8 వరకు, గొర్రెపిల్ల ఆయన యొద్ద నుండి అనగా సింహాసనము మీద కూర్చొని యున్న వాని యొద్ద నుండి గ్రంధమును తీసికొనినట్లుగా చూడగలము. (ఆ తరువాత కాలములో ప్రకటన 4::2–3 వచ్చును) ప్రకటన 4:2–3 లోను మరియు 9-10 వరకును గల వచనములలో దానిని చూచెదము. ఏమిటది? ఇది "ఒకే దేవుని" యొక్క మర్మము.

ఆయన (యేసు) దేవునిలో నుండి వచ్చెను. శరీరమందు ప్రత్యక్షమాయెను. మరణించి మరల లేచెను. "తండ్రి యొక్క రొమ్మునకు" తిరిగి తేబడెను. యోహాను అదే చెప్పెను. తండ్రి యొక్క కుడిపార్శ్వము నందున్న అద్వితీయ కుమారుడు ఆయనే. ఆయనను తండ్రి బయలుపరచెను. యోహాను 1:18. ఆయన తన యొక్క పెండ్లి కుమార్తెను చేర్చుకొనుటకును, తన్ను స్వయముగా ఇశ్రాయేలు వారికి తెలియపరచుకొనుటకును దేవునికి (మెస్సీయ) సమయము వచ్చెను. (తన్ను తాను తెలియచేసికొనును) ఆ విధముగా దేవుడు మానవులతో శరీర సంబంధమును ఏర్పరచుకొనుటను మరల మనము చూచుచున్నాము. దావీదు కుమారునిగాను, రాజులకు రాజుగాను, ప్రభువులకు ప్రభువు గాను, అన్య పెండ్లి కుమార్తెకు పెండ్లి కుమారునిగాను ఆయన తన్ను బయలుపరచుకొనును. ఇద్దరు దేవుళ్ళు కారు గాని ఒకే దేవుడు. ఆయన తన యొక్క సర్వ శక్తి గల మూడు కార్యములను మరియు బిరుదులను బయలుపరచు చున్నాడు.

ఆయన ప్రవక్తయని జనులకు తెలియును. మెస్సీయా యొక్క గురుతు వారికి తెలియును. ప్రవక్త ద్వారా మాత్రమే అది రాగలదు. యోహాను 1:44–51. "ఫిలిప్పు బేత్సయిదా వాడు. అనగా అంద్రెయ పేతురు అను వారి పట్టణపు కాపురస్థుడు." ఫిలిప్పు నతనయేలును కనుగొని – ధర్మ శాస్త్రములో మోషేయు, ప్రవక్తలును ఎవరిని గూర్చి వ్రాసిరో ఆయనను కనుగొంటిమి. ఆయన యోసేపు కుమారుడైన నజరేయుడగు యేసు అని అతనితో చెప్పెను. అందుకు నతనియేలు – నజరేతులో నుండి మంచిదేదైనా రాగలదా? అని అతని నడుగగా – వచ్చి చూడుమని ఫిలిప్పు అతనితో అనెను. యేసు నతనయేలు తన యొద్దకు వచ్చుట చూచి – ఇదిగో ఇతడు నిజముగా ఇశ్రాయేలీయుడు. ఇతని యందు ఏ కపటమును లేదని అతని గూర్చి చెప్పెను. నన్ను నీవు ఎలాగు ఎరుగుదువని నతనయేలు ఆయనను అడుగగా, యేసు – ఫిలిప్పు నిన్ను పిలువక మునుపే, నీవు ఆ అంజూరపు చెట్టు క్రింద ఉన్నపుడే నిన్ను చూచితినని అతనితో చెప్పెను. నతనయేలు – బోధకుడా, నీవు దేవుని కుమారుడవు. ఇశ్రాయేలు రాజువు అని

ఆయనకు ఉత్తరమిచ్చెను. అందుకు యేసు – ఆ అంజూరపు చెట్టు క్రింద నిన్ను చూచితినని నేను చెప్పినందువలన నీవు నమ్ముచున్నావా? వీటి కంటె గొప్ప కార్యములు చూతువని అతనితో చెప్పెను. మరియు ఆయన – మీరు ఆకాశము తెరువబడుటయు, దేవుని దూతలు మనుష్య కుమారుని పైగా ఎక్కుటయును, దిగుటయును చూతురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను. "మానవులలోని హృదయాలోచనలను వివేచించగల శక్తి ఆయనకుండెను. దేవుని చేత ఏర్పరచబడిన వారు ఈయన మెస్సీయ అని అర్థము చేసికొనగలిగిరి. దేవుని యొక్క అభిషేకించ బడిన వాక్కు ఆయనే. హెబ్రీ 4:12. "ఏలయనగా దేవుని వాక్యము సజీవమై, బలము గలదై రెండంచులు గల ఎటువంటి ఖడ్గము కంటెను, వాడిగా ఉండి ప్రాణాత్మలను కీళ్ళను మూలుగను విభజించునంత మట్టుకు దూరుచు హృదయము యొక్క తలంపులను ఆలోచనలను శోధించు చున్నది."

బావి యొద్ద నున్న స్త్రీ ఆయన మాటలను వినెను. ఆమె యొక్క హృదయములోని ఆలోచనలను ఆయన వివేచించ కలిగెను. ఆయనను ఆమె ప్రవక్తగా గ్రహించెను. ఆ గొప్ప సామర్థ్యము బట్టి మెస్సీయాను గుర్తించెదరని ఆమె చాటించెను. యోహాను 4:7–26. "సమరయ స్త్రీ యొకతె నీళ్ళు చేదుకొనుటకు అక్కడికి రాగా, యేసు – నాకు దాహమున కిమ్మని ఆమె నడిగెను." ఆయన శిష్యులు ఆహారము కొనుటకు ఊరి లోనికి వెళ్ళి యుండిరి. ఆ సమరయ స్త్రీ – యూదుడవైన నీవు సమరయ స్త్రీనైన నన్ను దాహమున కిమ్మని ఏలాగు అడుగు చున్నావని ఆయనతో చెప్పెను. ఏలయనగా యూదులు సమరయులతో సాంగత్యము చేయరు. అందుకు యేసు – నీవు దేవుని వరమును – నాకు దాహమున కిమ్మని నిన్ను అడుగుచున్న వాడెవడో అదియు ఎరిగి యుంటే నీవు ఆయనను అడుగుదువు. ఆయన నీకు జీవ జలమిచ్చునని ఆమెతో చెప్పెను. అప్పుడా స్త్రీ – అయ్యా! ఈ బావి లోతయినది. చేదుకొనుటకు నీకేమియూ లేదే. ఆ జీవ జలము ఏలాగు నీకు దొరకును? తానును తన కుమాళ్ళను, పశువులును, ఈ బావి నీళ్ళు త్రాగి మాకిచ్చిన మన తండ్రియైన యాకోబు కంటె నీవు గొప్పవాడవా? అని ఆయనను అడిగెను. అందుకు యేసు ఈ నీళ్ళు త్రాగు ప్రతివాడును మరల

దప్పిగొనును. నేనిచ్చు నీళ్ళు త్రాగు వాడెప్పుడును దప్పిగొనడు. నేను వానికిచ్చు నీళ్ళు నిత్య జీవమున్నకై వానిలో ఊరెడి నీటి బుగ్గగా ఉండునని ఆమెతో చెప్పెను. ఆ స్త్రీ ఆయనను చూచి – అయ్యా, నేను దప్పిగొనకుండునట్లును, చేదుకొనుట కింత దూరము రాకుండునట్లును ఆ నీళ్ళు నాకు దయ చేయుమని అడుగగా – యేసు నీవు వెళ్ళి నీ పెనిమిటిని పిలుచుకొని రమ్మని ఆమెతో చెప్పెను. ఆ స్త్రీ – నాకు పెనిమిటి లేడనగా, యేసు ఆమెతో – నాకు పెనిమిటి లేడని నీవు చెప్పిన మాట సరియే. నీకు అయిదుగురు పెనిమిట్లుండిరి. ఇప్పుడు ఉన్నవాడు నీ పెనిమిటి కాడు. సత్యమే చెప్పితివనెను. అప్పుడా స్త్రీ – అయ్యా, నీవు ప్రవక్తవని గ్రహించు చున్నాననెను. మా పితరులు ఈ పర్వతమందు ఆరాధించిరి గాని ఆరాధింపవలసిన స్థలము యెరూషలేములో ఉన్నదని మీరు చెప్పుదురని ఆయనతో అనగా యేసు ఆమెతో ఇట్లనెను – అమ్మా ఒక కాలము వచ్చుచున్నది. ఆ కాలమందు ఈ పర్వతము మీదనైనను యెరూషలేములోనైనను మీరు తండ్రిని ఆరాధింపరు. నా మాట నమ్ముము. మీరు మీకు తెలియని దానిని ఆరాధించు వారు. మేము మాకు తెలిసిన దానిని ఆరాధించువారము. రక్షణ యూదులలో నుండియే కలుగు చున్నది. అయితే యథార్థముగా ఆరాధించు వారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది. అది ఇప్పుడును వచ్చే యున్నది. తన్ను ఆరాధించు వారు అట్టి వారే కావలెనని తండ్రి కోరుచున్నాడు. దేవుడు ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను సత్యముతోను ఆరాధింపవలెననెను. ఆ స్త్రీ ఆయనతో – క్రీస్తనబడిన మెస్సీయ వచ్చునని నేనెరుగుదును. ఆయన వచ్చి నపుడు మాకు సమస్తమును తెలియజేయునని చెప్పగా, యేసు – నీతో మాటలాడు చున్న నేనే ఆయనని ఆమెతో చెప్పెను.

ప్రకటన 15:3 లో ఇట్లున్నది. "వారు – ప్రభువా, సర్వాధికారీ, నీ క్రియలు ఘనమైనవి. ఆశ్చర్యమైనవి. యుగములకు రాజా, నీ మార్గములు న్యాయములును, సత్యములునై యున్నవి. ప్రభువా, నీవు మాత్రము పవిత్రుడవు. నీకు భయపడని వాడెవడు? నీ నామమును మహిమపరచని వాడెవడు? నీ న్యాయ విధులు ప్రత్యక్షపరచబడినవి గనుక జనములందరు వచ్చి నీ సన్నిధిని నమస్కారము

చేసెదరని చెప్పుచు దేవుని దాసుడగు మోషే కీర్తనయు గొర్రెపిల్ల కీర్తనయు పాడు చున్నారు." దానిని మీరు చూశారా? ప్రధాన యాజకుడైన గొఱ్ఱెపిల్ల తన రక్తమును పరిహారముగా కరుణా పీఠము మీద మన పాపముల కొరకు పట్టుకొని యున్నవాడు, ప్రభువగు సర్వశక్తుడగు దేవుడు. ఇది ఆయన ప్రస్తుత కార్యాలయము. ఇపుడు ఆయన దానినే చేయుచున్నాడు. మన పాపముల నిమిత్తము ఆయన తన రక్తముతో విజ్ఞాపన చేయు చున్నాడు. కాని ఒక దినమున గొర్రెపిల్ల. యూదా గోత్రపు సింహముగా మారును. ఆయన శక్తితోను, మహిమతోను వచ్చి తన అధికారమును స్వీకరించి రాజుగా పరిపాలన చేయును. ఆయనే ఈ భూమి మీదకు రానై యున్న రాజు:. దాని అర్థము ఇపుడు ఆయన రాజు కాడని కాదు.. ఏలయనగా ఆయనే మన రాజు. దాని అర్థము పరిశుద్ధుల రాజు. ఇపుడున్నది ఆత్మ సంబంధమగు రాజ్యము. అది ఈ ప్రపంచ క్రమములో లేదు. ఎందుకనగా మనము కూడా ఈ లోక సంబంధులము కాము. ఆ కారణము చేతనే మనము ఈ లోకమునకు వేరుగా జీవించు చున్నాము. మన యొక్క పౌరసత్వము పరలోకమందున్నది. మనము తిరిగి జన్మించిన లోకపు ఆత్మను ప్రతిబింబించు చున్నాము. అక్కడ యేసు మనకు రాజుగా వున్నాడు. అందు వలననే మన స్త్రీలు పురుషుల బట్టలను ధరించుట లేదు. జుట్టు కత్తిరించుట లేదు. ఆ అలంకరణ సామాగ్రి వాడుట లేదు. లోకము యొక్క ఆ యా క్రియలు వీరిలో కనబడవు. మన మగవారు అందుకే త్రాగుడు, పొగ మొదలగు పాపములకు దూరంగా యున్నారు. మన యొక్క అధికారము పాపము మీద ఉన్న అధికారమై యున్నది. మనలో నివాసము చేయుచున్న క్రీస్తు ఆత్మ ద్వారా అది బలముగా పని చేయుచున్నది. భూమి మీద ఉన్న ప్రతి రాజ్యము చెదిరిపోవును. కాని మనది నిలచి యుండును.

ఒకే నిజ దేవుని యొక్క కార్యాలయములు మరియు ప్రత్యక్షతలు గూర్చి మనము మాట్లాడుకొనుచున్నాము. లేఖన పూర్వకమగు అధ్యయనము ద్వారా ఆయన మహిమను మనము చూచియున్నాము. కాని ఆయనను జ్ఞానము ద్వారా మనము తెలిసికొనలేము. ఆత్మీయముగా ఆయనను తెలిసికొనగలము. ఆత్మ సంబంధ మగు ప్రత్యక్షత ద్వారా తెలిసికొనగలము. ఆయన యేసుగా ఉండిన శరీరము విడిచిన

తరువాత అగ్ని స్తంభముగా తిరిగి మారిపోయెను. కాని ఆయన తిరిగి వచ్చి ఆత్మ ద్వారా జనుల మధ్య నివాసము చేయుదునని వాగ్దానము చేసెను. పెంతెకోస్తు దినమున ఆ అగ్ని స్తంభము దిగి వచ్చెను. అగ్ని నాలుకలుగా అది విభాగించ బడెను. అవి ప్రతి వారి మీదను వ్రాలెను. దేవుడేమి చేయుచున్నాడు? ఆయన సంఘములో తన్ను విభాగించుకొనుచున్నాడు. ఆ స్త్రీ, పురుషులందరిలో ఆయన తన్ను తాను సంఘము మధ్య విభాగించుకొను చున్నాడు. ఆలాగు చేయుదునని ఆయన చెప్పెను. యోహాను 4:12. "నేను తండ్రిని వేడుకొందును. మీ యొద్ద ఎల్లపుడు ఉండుటకై ఆయన వేరొక ఆదరణ కర్తను అనగా సత్య స్వరూపియగు ఆత్మను మీకనుగ్రహించును. లోకము ఆయనను చూడదు. ఆయనను ఎరుగదు. గనుక ఆయనను పొందనేరదు. మీరు ఆయనను ఎరుగుదురు. ఆయన మీతో కూడా నివసించును. మీలో ఉండును. మిమ్మును అనాధలనుగా విడువను. మీ యొద్దకు వత్తును. కొంత కాలమైన తరువాత లోకనము నన్ను మరి ఎన్నడును చూడదు. అయితే మీరు నన్ను చూతురు. నేను జీవించు చున్నాను. గనుక మీరును జీవింతురు." నేను నా తండ్రి యందును, మీరు నా యందును, నేను మీ యందును ఉన్నామని ఆ దినమున మీరెగుదురు. నా ఆజ్ఞలను అంగీకరించి వాటిని గైకొనువాడే నన్ను ప్రేమించు వాడు. నన్ను ప్రేమించువాడు నా తండ్రి వలన ప్రేమింపబడును. నేనును వానిని ప్రేమించి వానికి నన్ను కనుబరచుకొందునని ఆయన చెప్పెను. ఇస్కరియోతు కాని యూదా – ప్రభువా, నీవు లోకమునకు కాక మాకు మాత్రమే నిన్ను నీవు కనుబరచుకొనటకేమి సంభవించెనని అడుగగా – యేసు – ఒకడు నన్ను ప్రేమించిన యెడల వాడు నా మాట గైకొనును. అప్పుడు నా తండ్రి వానిని ప్రేమించును. మేము వాని యొద్దకు వచ్చి వాని యొద్ద నివాసము చేతుము." మరియొక ఆదరణ కర్తను పంపించునట్లుగా తండ్రిని వేడుకొందునని ఆయన చెప్పెను. ఆయన వారితో యున్నాడు. (శిష్యులతో) కాని వారిలో లేడు. ఆయనే క్రీస్తు. ఆ తరువాత ఇరవై మూడవ వచనములో ఆయన తన్ను గూర్చియు, తండ్రి గూర్చియు చెప్పుకొనుచున్నాడు. మేము వచ్చెదమని ఆయన చెప్పెను. ఆత్మ వచ్చు చున్నది. అదే దేవుని యొక్క ఆత్మ తండ్రిగాను, కుమారునిగాను బయలుపరచ

బడెను. ఇంకా చాలామందిలో బయలుపరచబడును – ఒకే దేవుడు. ఆయన ఆత్మ స్వరూపియై యున్నాడు.

పరిశుద్ధుడనగా పోపు లేక పరిశుద్ధుడనగా ఒక బిషప్పు లేక ఒక యాజకుడు అని ఎవరునూ చెప్పలేకపోవుటకు అదియే కారణము. క్రీస్తు మాత్రమే పరిశుద్ధుడు. పరిశుద్ధాత్మ మనలోనే యున్నది. విశ్వాసులకు మాట్లాడు హక్కు లేదని పోపు వారసులు చెప్పుటకు ఎంత ధైర్యము! ప్రతి వారికిని చెప్పుటకు ఏదో యున్నది. ప్రతి వారికి ఒక పని యున్నది. ప్రతి వారికి వారి సేవ యున్నది. పెంతెకోస్తు దినమున పరిశుద్ధాత్మ దిగి వచ్చి ఒక్కొక్కరి మీద విభాగింపబడినది. క్రీస్తు చెప్పినది నెరవేరునట్లు ఈలాగు జరిగెను. "నేను నా తండ్రియందును, మీరు నా యందును, నేను మీ యందును ఉన్నామని ఆ దినమున మీరెరుగుదురు." యోహాను 14:20.

నేనున్న వాడననిన గొప్పవాడు, సర్వశక్తుడగు దేవుడు. ఆత్మగా తన యొక్క నిజ సంఘము నింపుటకు వచ్చియున్నాడు. ఆయన తన కిష్టమొచ్చిన చోటకు కదల గలడు. తాను కోరుకొనిన వారి మీదికి దిగి వచ్చును. మనము మన మధ్య ఎవరినీ పరిశుద్ధులనుగా చేయజాలము. ప్రభువు యొక్క నిజ సమాజమంతయూ పరిశుద్ధ మైనదే. ఎందుకనగా పరిశుద్ధాత్మ యొక్క సన్నిధి అచ్చటున్నది. ఆయనయే పరిశుద్ధాత్మయై యున్నాడు. సమాజము దానికది పరిశుద్ధముగా లేదు గాని ఆయనే పరిశుద్ధుడై యున్నాడు.

ఇప్పుడు అదియే ప్రత్యక్షత : యేసు క్రీస్తే దేవుడు. పాత నిబంధనలోని యెహోవాయే క్రొత్త నిబంధనలోని యేసు. మీరెంత గట్టిగా ప్రయత్నించినా గాని ముగ్గురు దేవుళ్ళున్నారని రుజువు చేయలేరు. ఆయన ఒక్కడై యున్నాడను సత్యమును మిమ్మును గ్రహింపచేయ కలిగినది పరిశుద్ధాత్మ యొక్క ప్రత్యక్షతయే. పాత నిబంధనలోని యెహోవాయే క్రొత్త నిబంధనలోని యేసు అని చూచుటకు ప్రత్యక్షత కావలెను. సాతాను సంఘము లోనికి ప్రాకి వచ్చి జనులను సత్యము చూడనీయకుండా గ్రుడ్డివారినిగా చేసి యున్నది. ఆ విషయములో వారు గ్రుడ్డి

వారయినపుడు రోమ్ సంఘము ప్రభువైన యేసు క్రీస్తు నామములో బాప్తిస్మ మిచ్చుటను ఆపినది.

ఈ దినములలో దైవత్వము యొక్క సత్యమును గ్రహించుటకు పరిశుద్ధాత్మ యొద్ద నుండి నిజమగు ప్రత్యక్షత కావలెను. ఎందుకనగా లేఖనములను మార్పు చేయుచున్న వారి మధ్య మనం ఉన్నాము. కాని జయించి, విజయము సాధించు సంఘము ప్రత్యక్షత మీదనే నిర్మించబడి యున్నది. కాబట్టి తన సత్యమును దేవుడే బయలుపరచ వలెను. అయితే నీటి బాప్తిస్మపు విషయములో నీకు వాస్తవంగా ఒక ప్రత్యక్షత అవసరము లేదు. అది నీ కళ్ళకు కట్టినట్లుగా కనిపించు చున్నది. తండ్రి యొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మ యొక్కయు నామములో బాప్తిస్మము ఇమ్మని ప్రభువు శిష్యులకు ప్రత్యక్షముగా ఆజ్ఞాపించెను. ఒక్క నిమిషములో అపోస్తలులు తప్పు త్రోవ పట్టుటకు సాధ్యమయిన పరిస్థితి యున్నది. అపుడు వారు ఇష్టపూర్వకంగానే అవిధేయులయిన వారగుదురు. ఆ పేరు ఏమిటో వారికి తెలియును. ప్రభువైన యేసు క్రీస్తు నామములో తప్ప మరే విధముగా కూడా వారు బాప్తిస్మమును ఇచ్చినట్లుగా వాక్యములో ఎచ్చటనూ ఆధారము లేదు. అపోస్తలుల కార్యముల గ్రంధము సంఘము కార్య రూపములో యుండుటను చూపించు చున్నదని ఇంగిత జ్ఞానము గల ఎవరయినా గాని చూడగలరు. వారు ఏ విధంగా బాప్తిస్మమిచ్చిరో అదే విధానమును మనము కూడా పాటించ వలెను. అది చాలా కఠినముగా వున్నదని నీవు తలంచుచున్న యెడల దీని గూర్చి నీవేమి ఆలోచించుచున్నావు? ప్రభువైన యేసు నామములో బాప్తిస్మము పొందని వారెవరయినా గాని మరల బాప్తిస్మము పొందవలసి యున్నారు.

అపో. కా. 19:1–6. “అపోల్లో కొరింధులో నున్నపుడు జరిగినదేమనగా, పౌలు పై ప్రదేశములలో సంచరించి ఎఫెసునకు వచ్చి కొందరు శిష్యులను చూచి – మీరు విశ్వసించినపుడు పరిశుద్ధాత్మను పొందితిరా? అని వారినడుగగా వారు పరిశుద్ధాత్ముడున్నాడన్న సంగతియే మేము వినలేదని చెప్పిరి. అప్పుడతడు – అలాగైతే మీరు దేనిని బట్టి బాప్తిస్మము పొందితిరని అడుగుగా వారు – యోహాను

బాప్తిస్మమును బట్టియే అని చెప్పిరి. అందుకు పౌలు – యోహాను తన వెనుక వచ్చు వానియందు  అనగా యేసు నందు  విశ్వాసముంచ వలెనని ప్రజలతో చెప్పుచు మారుమనస్సు విషయమైన బాప్తిస్మమిచ్చెనని చెప్పెను. వారు ఆ మాటలు విని ప్రభువైన యేసు నామమున బాప్తిస్మము పొందిరి. తరువాత పౌలు వారి మీద చేతులుంచగా పరిశుద్ధాత్మ వారి మీదికి వచ్చెను. అప్పుడు వారు భాషలతో  మాట్లాడుటకును  ప్రవచించుటకును మొదలుపెట్టిరి" చూడండి. ఎఫెసులో నున్న వారు మంచి జనులే. రానున్న మెస్సీయా గూర్చి  వారు వినిరి. యోహాను వారికి బోధించెను. వారు మారుమనస్సు బాప్తిస్మము పొంది యుండిరి. యేసు నందు విశ్వసించుటకు ముందుకు చూచుచుండిరి. కాని ఇపుడు వారు యేసు వైపుకు చూడవలసిన సమయము వచ్చినది.  క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిరి. అది పరిశుద్ధాత్మను పొందవలసిన సమయము.  వారు ప్రభువైన యేసు క్రీస్తు నామములో బాప్తిస్మము పొందినపుడు పౌలు వారి  మీద చేతులుంచగా పరిశుద్ధాత్మ వారి మీదికి దిగి వచ్చెను.

ఎఫెసు యొద్ద నున్న ఆ జనులు చాలా చక్కని జనులే. వారికున్నంత భద్రత ఎవరికినీ లేదని చెప్పవచ్చును. వారెంత దూరము వచ్చారో గమనించండి. రానున్న  మెస్సీయను అంగీకరించు వరకు  వారు వచ్చారు. వారాయన కొరకు సిద్ధపడి యున్నారు. అయినను వారాయనను విడచిపెట్టుటను మీరు చూడడము లేదా? ఆయన వచ్చెను. వెళ్ళిపోయెను. వారు ప్రభువైన యేసు క్రీస్తు నామములో బాప్తిస్మము పొందవలసిన అవసరత యున్నది. వారు పరిశుద్ధాత్మతో నింపబడ వలసిన అవసరమున్నది.

నీవు ప్రభువైన యేసు క్రీస్తు నామములో బాప్తిస్మము పొందినపుడు దేవుడు నిన్ను పరిశుద్ధాత్మతో నింపును. అది వాక్యము. అపో.కా 19:6 మనము చదివి యున్నాము. అది అపో. కా. 2:38 ను నెరవేర్చుచున్నది. "ప్రతివాడును మారు మనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము యేసు క్రీస్తు నామములో బాప్తిస్మము పొందవలెను. అపుడు మీరు పరిశుద్ధాత్మ అనువరము పొందుదురు." చూడండి.

పేతురు పరిశుద్ధాత్మ ద్వారా దేనిని చెప్పెనో, పౌలు కూడా ఖచ్చితంగా పరిశుద్ధాత్మ ద్వారా అదే చెప్పెను. చెప్పబడినది మారజాలదు. పెంతెకోస్తు మొదలుకొని ఏర్పరచ బడిన చివరి వ్యక్తి బాప్తిస్మము పొందు వరకును అది అదే విధంగా యుండ వలెను. గలతీ 1:8. "మేము గాని లేదా పరలోకము నుండి ఒక దూత గాని వచ్చి మేము బోధించిన సువార్తను గాక మరియొక సువార్తను బోధించిన యెడల శాపగ్రస్తుడగును."

మీలో కొందరు ఏకత్వము వారు తప్పు బాప్తిస్మము ఇచ్చుచున్నారు. నీటిలో ముంచుట వలన మీకు రక్షణ కలుగ వచ్చును గాని మీరు మారు మనస్సు కొరకే బాప్తిస్మమిచ్చుచున్నారు. నీటి ద్వారా మారుమనస్సు రాదు. అది ఆత్మ యొక్క కార్యము. పరిశుద్ధాత్మ ద్వారా అతడు ఆజ్ఞ ఇచ్చెను. "మారు మనస్సు పొంది ప్రతివాడును ప్రభువైన యేసు నామములో బాప్తిస్మము పొందవలెను." నీటి మూలమున మారు మనస్సు వచ్చునని అతడు చెప్పలేదు. "దేవుని పట్ల మంచి మనస్సాక్షి" కలిగి యున్నాననుటకు అది రుజువు మాత్రమే. I పేతురు 3:21. "అందుకు సాదృశ్యముగా నున్న బాప్తిస్మము ఇపుడు మిమ్ములను రక్షించు చున్నది. (శరీర మాలిన్యమును తీసివేయుట కాదు గాని దేవుని పట్ల సరయిన మనస్సాక్షి కలిగి యున్నావనుటకు ప్రత్యుత్తరమై యున్నది) యేసు క్రీస్తు పునరుద్ధానము ద్వారా అది వచ్చుచున్నది" దానిని నేను నమ్ముచున్నాను.

ఎవరికయినా ఏమయినా తప్పు అభిప్రాయములున్న యెడల చరిత్ర ఈ నీటి బాప్తిస్మమును గూర్చి రుజువు చేయును. ప్రభువైన యేసు క్రీస్తు నామములో తప్ప మరే ఇతర విధానము లేదు. మీరు చరిత్రను చదువ వలెనని సలహా ఇచ్చు చున్నాను. మీ యంతట మీరే తెలిసికొనండి. బాప్తిస్మమును గూర్చిన నిజ రికార్డు మీ ముందుంచు చున్నాను. క్రీ. శ. 100 లో రోమ్ నందు ఇది జరిగెను. ఇది టైమ్ పత్రికలో డిసెంబరు 5. 1955 లో పునర్ముద్రితమయినది. "పెద్ద తన చేతిని ఎత్తెను. పబ్లియస్ డెనియస్ బాప్తిస్మపు ద్వారము గుండా అడుగిడెను. నడుము వరకు ఉండిన నీటిలో కట్టెలమ్ము మార్కస్ వస్కా నిలబడి యుండెను. తన ప్రక్క

నున్న కొలనులో నుండి చేయి ఊపుచున్న పబ్లియస్‌ను చూచి అతడు నవ్వు చుండెను. క్రెడిస్? అని అతడడిగెను. 'క్రెడో' అని పబ్లియస్ జవాబు ఇచ్చెను. 'నా రక్షణ యేసు క్రీస్తు నుండి వచ్చినదని నేను నమ్ముచున్నాను. ఆయన పొంతి పిలాతు కాలములో సిలువ వేయబడెను. ఆయనతో కూడా నేను చనిపోయితిని. అందువలన నేను నిత్య జీవమును పొందితిని.' అపుడు బలమగు చేతులు అతనిని పట్టుకొని నీటిలో ముంచెను. మార్కస్ యొక్క స్వరము అతని చెవులకు వినబడెను – ప్రభువైన యేసు నామములో నీకు బాప్తిస్మమిచ్చుచున్నాను – చల్లని నీటిలో అతడు మునిగి లేచెను.

ఆ తరువాత సత్యము నశించిపోయినది. (ఈ చివరి కాలము వరకు అది తిరిగి రాలేదు. నైసియా మొదలుకొని ఈ శతాబ్దపు మలుపు వరకు అది బయటకు రాకుండా యుండెను) వారు ప్రభువైన యేసు క్రీస్తు నామములో బాప్తిస్మమిచ్చు చుండిరి. ఇది మరల వచ్చి యున్నది. ఆత్మ ఇచ్చు ఆ ప్రత్యక్షతను సాతాను ఆపజాలదు.

అవును. ముగ్గురు దేవుళ్ళున్న యెడల నీవు తండ్రి కొరకును, కుమారుని కొరకును, పరిశుద్ధాత్మ కొరకును బాప్తిస్మము ఇవ్వ వచ్చును. కాని దేవుడు ఒక్కడే యని యోహానుకు ప్రత్యక్షత అనుగ్రహించబడెను. ఆయన పేరు ప్రభువైన యేసు క్రీస్తు. నీవు ఒక్క దేవుని కొరకే బాప్తిస్మమియ్య వలెను. ఒకే ఒక్కడు. అందువలననే పేతురు ఆ విధంగా పెంతెకోస్తు నాడు బాప్తిస్మమిచ్చెను. అతడు తాను పొందిన ప్రత్యక్షత పట్ల నమ్మకముగా యుండెను. "మీరు ఏ యేసును సిలువ వేసితిరో ఆ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను చేసెనని ఇశ్రాయేలీయులు నిశ్చయముగా తెలిసికొనవలెను." ఆయనే ప్రభువైన యేసు క్రీస్తు.

యేసే ప్రభువుగాను, క్రీస్తుగాను ఉన్నాడు. ఆయన (యేసు) ఉన్నవాడు. మరొకరు లేరు. ఆయన తండ్రిగా, కుమారుడుగా మరియు పరిశుద్ధాత్మగా ఒకే వ్యక్తి యందే శరీరము ధరించి ప్రత్యక్షమాయెను. దేవుడు ముగ్గురు వ్యక్తులలో ఉండుట కాదు, ధన్యమగు త్రిత్వము లేదు. ఒకే దేవుడు, ఒకే వ్యక్తిత్వముగా మూడు పెద్ద బిరుదులు కలిగి యున్నాడు. మూడు కార్యాలయములు కలిగి యుండి ఆ బిరుదులను బయలుపరచుచున్నాడు. దీనిని మరియొకసారి వినండి. ఈ యేసే

ప్రభువు మరియు రక్షకుడు, క్రీస్తు అయి యున్నాడు. ప్రభువు (తండ్రి) క్రీస్తు (పరిశుద్ధాత్మ) యేసే అయి యున్నాడు. ఆ రెండునూ ఆయనే. (ప్రభువు మరియు క్రీస్తు)

దైవత్వము యొక్క నిజ ప్రత్యక్షతను అది చూపించని యెడల మరేదియూ ఇక చూపించదు. ప్రభువు మరియొకడు కాడు. క్రీస్తు మరియొకడు కాడు. ఈ యేసే ప్రభువైన యేసు క్రీస్తు – ఒకే దేవుడు.

ఒక రోజున ఫిలిప్పు యేసుతో ఇట్లనెను, "ప్రభువా, మాకు తండ్రిని చూపించుము. అంతే చాలును" యేసు అతనితో ఇట్లనెను, "ఇంత కాలము నుండి నేను మీతో యున్నాను గదా, నీవు నన్ను ఎరగవా? నన్ను చూచిన వాడు తండ్రిని చూచి యున్నాడు. కాబట్టి మాకు తండ్రిని చూపించుమని నీవు నన్ను అడుగుట ఏల? నేనును, నా తండ్రియు ఏకమై యున్నాము." ఒకసారి నేను దానిని చెప్పి నపుడు ఒకామె నాతో ఇట్లన్నది, "ఒక్క నిమిషము ఆగుము. బ్రెన్‌హాం. నీవు నీ భార్య ఒక్కటి కదా?"

"ఆలాగు కాదు" అన్నాను.

"క్షమించు" అన్నది.

అప్పుడు నేనిట్లు చెప్పాను, "నీవు నన్ను చూచుచున్నావా?"

"అవును" అన్నదామె.

"నా భార్యను నీవు చూచుచున్నావా?" అన్నాను.

"లేదు" అన్నదామె.

"కాబట్టి ఆ ఏకత్వము మరో విధమైనది. ఎందుకనగా నన్ను చూచిన వాడు తండ్రిని చూచి యున్నాడు అని ఆయన చెప్పెను" గదా అన్నాను.

సాయంకాల సమయములో వెలుగుండును అని ప్రవక్త చెప్పెను. పాటలో ఇట్లు వ్రాయబడినది.

సాయంకాలమందు వెలుగుండును
మహిమ బాటను నిశ్చయంగా మీరు కనుగొందురు.
నీటి బాటలో ఈనాడు వెలుగున్నది.
ప్రశస్తమగు యేసు నామములో సమాధి చేయబడుటయే.
ముసలి వారు, యువకులు, అందరూ పాపము విషయము
పశ్చాత్తాప పడవలెను.
పరిశుద్ధాత్మ నిశ్చయముగా లోనికి ప్రవేశించును
సాయంకాలపు వెలుగు వచ్చియున్నది –
దేవుడు మరియు క్రీస్తు ఏకమై యున్నారనునని నిజము.

కొంత కాలము క్రితము నేనొక యూద రబ్బీతో మాట్లాడు చుంటిని. అతడేమి చెప్పెననగా, "అన్యులైన మీరు దేవుని మూడు ముక్కలు చేసి, ఆయనను యూదునికి ఇవ్వలేరు. దానికన్నను మాకు బాగుగా తెలియును."

అందుకు నేను చెప్పినదేమనగా, "రబ్బీ అది నిజమే. మేము దేవుని మూడు ముక్కలుగా చేయడము లేదు. మీరు ప్రవక్తలను నమ్మెదరు, కాదా?"

"నిజముగా నేను నమ్మెదనని" అతడు చెప్పెను.

"నీవు యెషయా 9:6 నమ్ముచున్నావా?"

"అవును."

"ప్రవక్త యెవనిని గూర్చి మాట్లాడుచున్నాడు?"

"మెస్సీయ" ను గురించి మాట్లాడు చున్నాడు.

అందుకు నేను, "దేవునితో మెస్సీయాకున్న సంబంధమేమి?" అని అడిగితిని.

అందుకతడు "అతడు దేవుడై యున్నాడని" చెప్పెను.

అందుకు నేను "అది నిజమే" "ఆమేన్" అని చెప్పితిని.

మీరు దేవుని ముగ్గురు వ్యక్తులుగానో లేక మూడు భాగాలుగనో వుంచ లేరు. తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ అను ముగ్గురు దేవుళున్నారని మీరు ఒక యూదునికి చెప్పజాలరు. ఆ సిద్ధాంతము ఎక్కడ నుండి వచ్చెనో వెంటనే అతడు చెప్పగలడు. నైసీన్ ఆలోచన సభ యొద్ద ఈ ఆచారము ఉదయించినదని యూదునికి తెలియును.'' వారు మనలను అన్యులని నిందించుటలో ఆశ్చర్యము లేదు.

మారని దేవుని గూర్చి మనము మాట్లాడుకొనుచున్నాము. యూదులు కూడా దానిని నమ్మెదరు. కాని ఈ మారని దేవుని సంఘము ఆయనను మార్చి చూపించు చున్నది. ఒక్క దేవుని ముగ్గురుగా చూపించు చున్నారు. కాని సాయంకాలమందు వెలుగు వచ్చుచున్నది. యూదులు పాలస్తీనాకు తిరిగి వచ్చుచున్న కాలములో ఈ సత్యము తిరిగి వచ్చుచున్న సంగతిని ప్రత్యేకముగా చూడవలసి యున్నాము. దేవుడు మరియు క్రీస్తు ఒక్కటై యున్నారు. ఈ యేసు ప్రభువు, క్రీస్తును ఒక్కరుగానే వున్నాడు.

యోహానుకు ప్రత్యక్షత యున్నది. యేసే ఆ ప్రత్యక్షతగా యున్నాడు. లేఖనములో ఆయన స్వయంగా దానిని చెప్పుకొనెను – ''నేను ఉండిన వాడను. ఇప్పుడున్న వాడను, రానున్న వాడను, ఆయనే సర్వశక్తుడు. ఆమేన్.''

ప్రత్యక్షత నీకు అందని యెడల పైకి చూచి దేవుని వెదకుము. దానిని నీవు పొందుటకు అది ఒక్కటే మార్గము. ప్రత్యక్షత అనునది దేవుని నుండియే రావలసి యున్నది. అది ఎన్నడునూ మానవ ప్రయత్నముల ద్వారాను, ప్రకృతి సంబంధమగు ప్రయత్నముల ద్వారాను రాదు. ఆత్మ సంబంధమగు ప్రభావము వలననే ఇది వచ్చును. నీవు లేఖనమును కంఠత చేయ వచ్చును. అది చాలా అద్భుతమైనదే. అయినా అది పని చేయదు. దేవుని నుండి వచ్చిన ప్రత్యక్షతయై యుండ వలయును. పరిశుద్ధాత్మ ద్వారానే యేసు క్రీస్తని ఒకడు ఒప్పుకొనునని వాక్యములో చెప్పబడి యున్నది. నీవు పరిశుద్ధాత్మను పొందవలసి యున్నది. అప్పుడు మాత్రమే ఆత్మ యేసే క్రీస్తే యున్నాడనియు, దేవుని అభిషిక్తుడను ప్రత్యక్షతను నీకు ఇచ్చును.

దేవుని యొక్క ఆత్మ బయలుపరచని యెడల దేవుని సంగతులను ఎవడునూ గ్రహించజాలడు. దేవుని యొక్క ఆత్మ వారికి ప్రత్యక్షపరచ వలెను. ఈ

లోకములోని వాటికంటెను ఎక్కువగా మనము దేవుని యొక్క ప్రత్యక్షత కొరకు మొర పెట్టవలెను. మనము బైబిలును అంగీకరించి యున్నాము. అందులోని గొప్ప సత్యములను మనము స్వీకరించి యున్నాము. అయినను అది చాలా మంది ప్రజలలో నిజ స్థితిగా ఉండుట లేదు. ఎందుకనగా ఆత్మ యొక్క ప్రత్యక్షత అక్కడ లేదు. వాక్యము ఇంకా జీవము పొందలేదు. 2 వ కొరింథీ 5:21 లో చెప్పబడినది. యేసు క్రీస్తుతో మనము ఐక్యమగుట ద్వారా మనము దేవుని యొక్క నీతియగు చున్నాము. దానిని మీరు గ్రహించారా? మనము దేవుని యొక్క నీతి అయి యున్నాము. ఇది క్రీస్తులో ఉండుట ద్వారా జరిగినదని చెప్పబడి యున్నది. ఆయన (యేసు) మన నిమిత్తము పాపమాయెనని అది చెప్పుచున్నది. ఆయన పాప యుక్తమని చెప్పుట లేదు గాని మన కొరకు పాప మాయెను. ఆయనతో మనము ఐక్యమగుట వలన మనము దేవుని యొక్క నీతిగా మారి యున్నాము. ఆ వాస్తవమును మనము అంగీకరించ వలెను. (తప్పక మనము అంగీకరించ వలెను) ఆయన అక్షరాలా మనకొరకు పాపమాయెను. మన కొరకు ఆయన ప్రత్యామ్నాయముగా మారెను. ఆయనతో మనము ఐక్యమగుట వలన మనము దేవుని యొక్క నీతిగా ఉన్నామను సత్యమును కూడా తప్పక మనము అంగీకరించ వలెను. ఒక దానిని తిరస్కరించినపుడు మరో దానిని కూడా తిరస్కరించిన వారమగుదుము. ఒకటి అంగీకరించినపుడు మరొకటి అంగీకరించిన వారమగుదుమని బైబిలు చెప్పు చున్నదని మనకు తెలియును. దానిని కాదనలేము. కాని దాని యొక్క ప్రత్యక్షతను పోగొట్టుకొనుచున్నారు. చాలామంది దేవుని యొక్క పిల్లలకు అది వాస్తవముగా తోచుట లేదు. అది బైబిలులోని ఒక మంచి వచనముగా ఉన్నది. కాని దానిని మనము మన విషయములో సజీవమగు దానినిగా చేసికొనవలెను. అది ప్రత్యక్షతను పొందును.

మీకు ఆశ్చర్యమును మరియు సహాయమును కలుగుజేయు ఒక సంగతిని ఇక్కడ చూపించెదను. క్రొత్త నిబంధన ఆదిలో గ్రీకు భాష యందు వ్రాయబడినదన్న మాటను నమ్మని ఏ విద్యార్థియు ఉండడు. మన గొప్ప బైబిలు విద్యార్థులందరూ చెప్పినది వినండి. దేవుడు మన ప్రపంచమునకు మూడు గొప్ప రాజ్యములను ఇచ్చెను. సువార్త నిమిత్తము మూడు గొప్ప త్యాగములను చేసెను. ఆయన గ్రీకులకు

ఒక విశ్వ భాషను ఇచ్చెను. ఆయన యూదులకు నిజమగు మతమును, నిజమగు దేవుని జ్ఞానమును రక్షకుని ద్వారా అనుగ్రహించెను. ఆయన రోమనులకు ఒక ఐక్య సామ్రాజ్యమును ఇచ్చెను. వారు మనకు న్యాయ శాస్త్రమును మరియు ఉన్నత విధానముల యొక్క క్రమమును ఇచ్చిరి. ఆ విధంగా మనకు నిజమగు మతము, చాలామంది జనులతో సంభాషించగల భాషను, ప్రభుత్వమును మరియు భౌతికంగా వ్యాపించు రహదారులు వచ్చి యున్నవి. చారిత్రాత్మకంగా మాట్లాడినపుడు ఇది చక్క గానే కనబడును. బైబిలు దినములలోని గ్రీకు భాష ఎంతో ఖచ్చితమైనదని, సరియైనదని ఈనాడు మన గ్రీకు పండితులు చెప్పుచున్నారు. గ్రీకు భాష నేర్చుకొనిన వారు బాగుగా అనుభవము మరియు సరియైన వ్యాకరణము గడించిన వారయినచో అతనికి క్రొత్త నిబంధన వాక్యము ఖచ్చితముగా దేనిని బోధించు చున్నదని తెలిసికొనును. కాని ఇది కేవలము సిద్ధాంతము గాదా? ఇది నిజము కాదా? బాగుగా ప్రసిద్ధి చెందిన ప్రతి గ్రీకు పండితుడును ఒక్కొక్క శాఖకు చెంది యున్నారు గనుక వారు ఒకరితో ఒకరు వాదించుకొనుచున్నారు. వారి యొక్క వాగ్వివాదము గుర్తింపు పొందిన గ్రీకు పదముల మీదను, గుర్తింపు పొందిన వ్యాకరణ సూత్రముల మీదను ఆధారపడి యుండలేదా? నిశ్చయంగా అది ఆ విధంగానే యున్నది. 325 నాటి నైసీన్ ఆలోచన సభకు ముందున్న పెద్దెమ కాలములో సహితము ఇద్దరు గొప్ప విద్యార్థు లుండిరి. వారు అరియస్ మరియు అతానిసియస్‌లు. ఒక గ్రీకు పదము గూర్చి వాదించుకొనుచూ సిద్ధాంతము విషయములో బంధింప బడిరి. వారి యొక్క వాదము బహు తీవ్ర తరము గాను, ప్రపంచ ప్రసిద్ధి చెందినది గాను ఉండెను. ప్రపంచము ఒక డిప్తాంగు మీద ముక్కలయినదని చరిత్రకారులు చెప్పుచుందురు. (డిప్తాంగు అనగా ఒక ఏక గుణితాక్షరము నందున్న రెండు అచ్చుల యొక్క శబ్దము) గ్రీకు అంతగా పరిపూర్ణమై మరియు దేవుని చేత నిర్ణయము చేయబడినపుడు అటువంటి వివాదము ఎందుకు పుట్ట వలెను? మనందరమును తప్పకుండా గ్రీకు నేర్చుకొనవలెనని దేవుడుద్దేశించ లేదు గదా? ఈనాటికిని మనము గ్రీకు గూర్చి వాదములాడుకొనుచున్నాము డాక్టర్ మెక్ క్రాసన్ వ్రాసిన "క్రీస్తు యొక్క చచ్చు బడిన సంఘము ఎక్స్‌రే తీయబడినది" అను పుస్తకమును ఉదాహరణకు

తీసికొనండి. అందులో అతడు చాలామంది పేరొందిన గ్రీకు వ్యాకరణ కర్తల యొక్క ఎన్నో వ్రాతలను ఎత్తి వ్రాసెను. తన స్వంత సంతృప్తి కొరకు రుజువుపరచుకొనెను. పరిశుద్ధాత్మ బాప్తిస్మము పొందిన వాడు నూతన జన్మను పొందిన వానితో సమానుడని బైబిలు బోధించు చున్నట్లు మారని గ్రీకు వ్యాకరణ సూత్రములను సంగ్రహించి చెప్పెను. బలిపీఠము మీదకు స్త్రీ రావచ్చునని అతడు నిస్సంకోచముగా చెప్పెను. ఎందుకనగా ప్రవచనము అను మాటకు బోధించుటని అర్థము చెప్పెను. కాని అతని వలె సామర్థ్యము గల ఇతర గ్రీకు పండితులను అతడు ఒప్పింపచేయ గలడా? ఎన్నడూ ఒప్పింపజాలడు. వ్యతిరేక అభిప్రాయము గల ఆ ఇతర పండితుల యొక్క వ్రాతలను మీరందరూ చదవవలసి యున్నారు. వారు ఎత్తి వ్రాసిన దానిని వినండి.

నేను చెప్పినది మాత్రమే సత్యమని ఎరుగుట కాదు గాని, మనము మరో అడుగు ముందుకు వేయుదము. యేసు యొక్క భాష మరియు ఆనాటి జనుల యొక్క భాషయగు ఆరామిక్‌లో మూల వ్రాతప్రతులు వ్రాయబడినవని చెప్పు కొందరు పండితులు నేడు మనకున్నారు. గ్రీకు భాషను ప్రజలు వ్రాయను లేరు. మాట్లాడను లేరు అనునది అందరికీ తెలిసిన సంగతేనని వారనుచున్నారు. దాని మీద మన చరిత్రకారులు విభాగింపబడియున్నారనునది సత్యము. ఉదాహరణకు డాక్టర్ స్కోఫీల్డును చూడండి. చాలా తెలివిగల పండితుడు. పరిశోధన ద్వారా అతడు తన సంతృప్తి కొరకు రుజువు చేసిన దానిని వినండి. ఆనాడు గ్రీకు మాట్లాడు జనుల వ్యావహారిక భాషలో క్రొత్త నిబంధన వ్రాయబడెనని అతడు చెప్పెను. తన నమ్మకములకు చక్కని కారణములను అతడు చూపించగలడు. అతని వశములో ఉండిన ఆ యా పత్రములను ఆధారము చేసికొనెను. మరొక ప్రక్క ఇంకొక పేరొందిన పండితుడు డాక్టర్ లాంసా యున్నాడు. క్రొత్త నిబంధన ఆరామిక్‌లో వ్రాయబడినదని అతడు నమ్మెను. ఆనాటి జనుల యొక్క భాష గ్రీకు కాదు గాని ఆరామిక్ అను అతని వాదనను బలపరచుటకు మహా చరిత్రకారుడగు టోన్‌బీ యున్నాడు. కాబట్టి క్రొత్త నిబంధన మొదట ఆరామిక్ భాషలో వ్రాయబడినదనుట నిజమనిపించు చున్నది.

ఏమయినా గాని దీనిని గూర్చి మనము పూర్తిగా ఒప్పుకొనుటకు ముందు కింగ్ జేమ్సు వర్షన్ మరియు డాక్టర్ లామ్సా అనువాదము రెండింటినీ చదువుదము. రెండింటిలోను పదములు ఒకే విధముగా యుండుట మనకు ఆశ్చర్యము కలిగించును. విషయములో గాని, సిద్ధాంతములో గాని, ఎట్టి భేదమును మనము కనుగొనము. ఈ క్రొత్తగా కనిపెట్టబడిన వ్రాతప్రతులు మరియు ముందే తెలిసిన వ్రాతల యొక్క క్రొత్త ప్రచురణలు ముందు మనకున్న వాటి యొక్క అధికారమును రుజువు చేయుచున్నవి. అందుకే దేవుడు వాటిని అనుమతించెనని మనము చెప్ప వచ్చును. అనువాదకులు ఒకరితో ఒకరు పోరాడుకొనుచున్నారు గాని లేఖనములు పోరాడుకొనుట లేదని మనము గ్రహించ వలెను.

బైబిలును వ్రాసిన భాషలో ఎంతో పరిజ్ఞానము సంపాదించిన పండితుల అనువాదమును ఆధారము చేసికొని నీవు దానిని చూడలేవు. ఇంకా నీవు ఆ విషయమును గ్రహించని యెడల నీ మనస్సు ఆచారము యొక్క ముసుగు క్రింద యున్నదని భావము. ఇక్కడ ఒక చివరి మాదిరి యున్నది. శాస్త్రులు, పరిసయ్యులు మరియు క్రీ. శ. 33 నాటి గొప్ప పండితులు వ్యాకరణము యొక్క ఖచ్చిత సూత్రములను ఎరుగుదురు. ఇందులో ఏమీ సందేహము లేదు. పాత నిబంధన వ్రాయబడిన భాష యొక్క పదములను, వాటి యొక్క ఖచ్చిత అర్థములను ఎరుగుదురు. వారికి అనన్యమగు జ్ఞానమున్నను కుమారుని యందు బయలు పరచబడిన దేవుని యొక్క వాగ్దాన వాక్యపు ప్రత్యక్షతను వారు పొందలేక పోయిరి. ఆదికాండము నుండి మలాకీ వరకు ఆయన కనబడుచున్నాడు. మొత్తం అధ్యాయములు ఆయనకును, ఆయన పరిచర్యకును అంకితము చేయబడినవి. ఆత్మ ద్వారా వెలిగింపబడిన వారు చాలా కొద్దిమందిగా యున్నారు. మిగిలిన వారు పూర్తిగా ప్రత్యక్షతను పోగొట్టుకొనిరి.

ఇపుడు మనము ఒక ముగింపునకు వచ్చి యున్నాము. ఈ ముగింపును ముందుగా మనము వాక్యములో పొందియున్నాము. అతి పురాతనమగు మంచి వ్రాత ప్రతులను సంపాదించ వలెనని మనము ప్రయత్నములు చేయుచున్నాము. అపుడే వాక్యమునకు శ్రేష్టమగు అర్థము గ్రహింప సాధ్యమగునని నమ్ముచున్నాము.

మనము ఎంత యధార్థముగా లేఖనములను అధ్యయనము చేసి పోల్చి చూచికొనినప్పటికిని ఎన్నడును దాని యొక్క నిజ అర్థమును గ్రహించ లేము. దానిని బయటకు తెచ్చుటకు దేవుని యొద్ధ నుండి ప్రత్యక్షత కావలెను. పౌలు చెప్పినది ఖచ్చితంగా అదే. మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో గాక ఆత్మ సంబంధమైన సంగతులతో సరి చూచుచూ, ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము. I కొరింథీ 2:15 వాగ్దానము చేయబడిన దానిని బయలు పరచుట ద్వారా దేవుడు తన స్వంత వాక్యమును అనువదించుటయే నిజమైన ప్రత్యక్షత.

నేను చెప్పిన దానిని బట్టి ఎవరును తప్పు త్రోవ పట్టకూడదు. వాక్యము యొక్క ఖచ్చితత్వము గూర్చి నేను నమ్ముట లేదని మీరు తలంచరాదు. ఇప్పుడు అది మనకున్నది. ఈ బైబిలు ఖచ్చితమైనదని నేను నమ్ముచున్నాను. యేసు ఈ భూమి మీద ఉండినపుడు పాత నిబంధనను పూర్తిగా ధృవీకరించెను. మన క్రొత్త నిబంధన వలె ఖచ్చితంగా అది సమకూర్చబడినది. అందులో ఏమీ పొరపాటు జరుగ లేదు. నేడు మనకు తప్పిపోని దేవుని వాక్యమున్నది. ఏ వ్యక్తియు ధైర్యముగా దాని నుండి ఏదియూ తీసివేయలేడు, దానికి మరేదియూ కలుపజాలడు. కాని మనకు అదే ఆత్మ అవసరమై మనకు బోధించవలసి యున్నది.

ఆత్మ ద్వారా మనకు ప్రత్యక్షత కావలసి యున్నది. ఒక క్రొత్త బైబిలు మనకు అవసరము లేదు. ఒక క్రొత్త అనువాదము మనకు అవసరము లేదు. అందులో కొన్ని చాలా మంచివే. వాటికి నేను వ్యతిరేకిని కాను. కాని మనకు ఆత్మ యొక్క ప్రత్యక్షత అవసరమై యున్నది. దేవునికి వందనములు. మనకు అవసరమగు దానిని మనము పొందగలము. ఏలయనగా మనకు దేవుడు తన ఆత్మ ద్వారా తన వాక్యమును బయలుపరచగోరుచున్నాడు.

ఎడతెగని జీవప్రదమగు, మరియు జయించు ప్రత్యక్షతను దేవుడు తన ఆత్మ ద్వారా మనకు అనుగ్రహించ నారంభించును గాక. సంఘము ఒక నూతన ప్రతక్షతను పొంది దాని ద్వారా సజీవ వాక్యము బయలుపరచినచో, మనము గొప్ప కార్యములు చేయుదుము, పరమందున్న మన తండ్రిని మనము మహిమ పరచుదుము. ఆమేన్.

❄ ❄ ❄

S. దానియేల్ సంపత్ కుమార్
డోర్ నెం: 147, తిరునిలై కాలని,
విచూర్ పోస్ట్, చెన్నై-600103




*for books contact :*

**S.DANIEL SAMPATH KUMAR**

*No. 147, Thirunilai colony ,*
*vichoor post , chennai - 600 103*

*E-Mail : sdanielsampathkumar@gmail.com*
*Website : danielendtimebooksministry.org*
*Phone No :* 99419 74213 , 96001 71260